# కన్నారంలో ప్రగతి పండుగ


56వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి గంగుల

- రూ.133కోట్లతో పనులు
- ప్రత్యేక దృష్టిపెట్టిన మంత్రి గంగుల కమలాకర్
- నగరంలో నిత్యం విస్తృత పర్యటనలు

కార్పొరేషన్, అక్టోబర్ 8: కరీంనగర అభివృద్ధిపై మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే వందలాది కోట్లతో పనులు చేయించి, నగర రూపురేఖలే మార్చివేసిన ఆయన, మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో నగరంలోని 60 డివిజన్లలో సుడిగాలిలా పర్యటనలు చేస్తున్నారు. ఎక్కడ విశ్రాంతి అనేది లేకుండా పార్టీ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కమ్యూనిటీ భవనాల కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యమిచ్చి మంత్రి ప్రతి డివిజన్‌కు వస్తున్నారు. సీఎం అస్యూరెన్స్ కింద విడుదలైన రూ.133 కోట్లతో వివిధ పనులకు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు చేస్తున్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేస్తుండడంతో అధికారులు వేగం పెంచారు. వచ్చే నెల రోజుల్లో పూర్తి చేసే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

**7 రోజుల్లో ..50 డివిజన్లు**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లు ఉండగా రూ.133 కోట్లతో అభివృద్ధి పనులను ఒకే ప్యాకేజీ కింద చేపడుతున్నారు. ప్రగతి పనులను గత సెప్టెంబర్ 30న స్థానిక కోతిరాంపూర్‌లో శ్రీకారం చుట్టిన మంత్రి గంగుల, ప్రతి రోజూ 5 నుంచి 6 డివిజన్లలో పర్యటించి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేపడుతున్నారు. కేవలం ఏడు రోజుల్లోనే 50 డివిజన్లలో సుడిగాలి పర్యటనలు చేసి 71 కార్యక్రమాల్లో పాల్గొని, రూ.133 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రతి డివిజన్‌లో సుమారుగా రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్ల పనులు చేపడుతున్నారు. ఓ వైపు కొత్త పనులకు భూమిపూజ చేయడంతోపాటు ఇప్పటికే పూర్తయిన పనులను ప్రారంభిస్తున్నారు. ఇందులో ప్రధానంగా గోదాంగడ్డలో రూ.2 కోట్లతో నిర్మించిన ఆధునిక దోభీ ఘాట్‌ను ప్రారంభించి, రజకులకు అందుబాటులోకి తెచ్చారు. శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన నైట్ ఫుడ్ బజార్‌ను ప్రారంభించారు. గిద్దెపెరుమాండ్ల దేవాలయ మైదానంలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, లైటింగ్, మానేరు డ్యాం సమీపంలో, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాకులు, లైటింగ్‌లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే నగరపాలక సంస్థ నుంచి సుమారుగా రూ.3.50 కోట్లతో అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే కఠారి దేవేందర్‌రావు (కేడీఆర్) పార్కును ప్రారంభించారు. తన పర్యటనలో మొదటి రోజు 8 డివిజన్లలో, రెండో రోజు 7, మూడో రోజు 11, నాలుగో రోజు 3, ఐదో రోజు 7, ఆరో రోజు 6, ఏడో రోజు 8 డివిజన్లలో పర్యటించి పనులకు అంకురార్పన చేశారు. మరో పది డివిజన్లలో పర్యటిస్తే సంపూర్ణం కానుండగా, నేడో, రేపో పూర్తికానున్నది.

**మొదలవుతున్న పనులు.. శరవేగంగా పూర్తికి చర్యలు**

మంత్రి గంగుల గత వారం పది రోజులుగా నగరంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పనులకు భూమిపూజ చేయడంతో పాటు వాటిని వేగంగా పూర్తి చేసేందుకు దృష్టి సారిస్తున్నారు. అంతేకాదు పనులు ప్రారంభిస్తున్న టైంలోనే నెల రోజుల్లో పూర్తిచేస్తామని అక్కడి ప్రజలకు హామీలు కూడా ఇస్తున్నారు. ఆయా డివిజన్‌లలో తమకు కావాల్సిన పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే అధికారులతో అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు.


జ్యోతినగర్‌లోని కేడీఆర్ పార్కులో మంత్రి గంగుల


జ్యోతినగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులు

# అనాథలకు అండగా ఎమ్మెల్యే సుంకె దంపతులు


అనాథ చిన్నారులకు కొత్త బట్టలు పెడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దంపతులు

- దసరా సందర్భంగా చిన్నారులకు కొత్త బట్టలు
- స్వయంగా అన్నం వడ్డించి వారితో సహపంక్తి భోజనాలు

గంగాధర, అక్టోబర్ 8: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను అక్కున చేర్చుకుని అండగా ఉంటున్నారు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దీవెన దంపతులు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కాట్నపల్లికి చెందిన నేరెళ్ల సమత, మమత, కెల్లేటి మానస, కొలిమికుంటకు చెందిన కొమ్ము నవదీప్, గంగాధర మండలం నారాయణపూర్‌కు చెందిన కండమంచి అంజలి, శైలజ, ర్యాలపల్లికి చెందిన రాజు, మనీష, రామడుగు మండలం రుద్రారంకు చెందిన గుర్రం నవిత, మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం మండలం ఎరడపల్లికి చెందిన అభినయ, ఆలయ తల్లిదండ్రులు మరణించడంతో అనాథలుగా మారారు. కాగా ఇప్పటికే సదరు అనాథ పిల్లలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే రవిశంకర్ దీవెన దంపతులు ప్రతి యేడాది దసరా పండుగ సందర్భంగా ఇంటికి పిలిపించుకుని భోజనం పెట్టి, కొత్తబట్టలు పెడుతున్నారు. ఇదే క్రమంలో ఆదివారం సదరు అనాథ పిల్లలను కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలోని తన ఇంటికి పిలిపించుకుని ఎమ్మెల్యే దంపతులు స్వయంగా వారికి భోజనం వడ్డించారు. పక్కన కూర్చుండబెట్టుకుని బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కొత్త బట్టలు పెట్టి సంతోషపెట్టారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు.

# ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

- పనిచేసే బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్
- అనంతారంలో అభివృద్ధి పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, అక్టోబర్, 8: ఎన్నికల ముందర ఊర్లకు వచ్చి ఊదరగొట్టే ప్రతిపక్షాల మాయమాటలు నమ్మవద్దని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజలకు పిలుపునిచ్చారు. పథకాలను చూసి బీఆర్‌ఎస్ సర్కారును ఆశీర్వదించాలని అర్థించారు. ఆదివారం అనంతారంలో పర్యటించారు. ముదిరాజ్ సంఘం ప్రహరీ, సీసీరోడ్డు, ఒడ్డెర యువసంఘ భవనం, బస్టాండ్, గౌడ సంఘం భవన నిర్మాణ పనుల శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు ఓటేసి మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంద్ర చందన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, ఎంపీటీసీలు తీగల పుష్పలత, ఒగ్గు నర్సయ్య, ఉప సర్పంచ్ సాదుల్ పాల్గొన్నారు.

# నిర్వాసితులకు అండగా ఉంటాం

- త్వరలోనే రూ.14కోట్ల నష్టపరిహారం ఇస్తాం
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు


ఎమ్మెల్యే రమేశ్‌బాబును సన్మానిస్తున్న సంకెపల్లి గ్రామస్తులు

వేములవాడ రూరల్, అక్టోబర్: నిర్వాసితులకు అండగా ఉన్నామని, ముంపు గ్రామాల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు స్పష్టం చేశారు. త్వరలోనే ఇండ్లకు సంబంధించి రూ.14 కోట్ల పరిహారాన్ని కూడా అందజేస్తామని చెప్పారు. సంకెపల్లి గ్రామంలో ముంపునకు గురైన 45 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో తీసుకోవాలని, వాటికి సంబంధించిన నష్టపరిహారం నిధులు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, ఆదివారం గ్రామస్తులు ఎమ్మెల్యే రమేశ్‌బాబు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడారు. ముంపు గ్రామాల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానన్నారు. సంకెపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించడంపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే, ఇందులో మంత్రి హరీశ్‌రావు కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రమేశ్‌బాబును సర్పంచ్ జింకె సునీత, యువకులు ఘనంగా సన్మానించారు. అనంతరం చల్మెడ నివాసంలో ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును సంకెపల్లి గ్రామస్తులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపీపీ బూర వజ్రమ్మ, జడ్పీటీసీ మ్యాకల రవి, వైస్ ఎంపీపీ ఆర్‌సీ రావు, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, అనుపురం సర్పంచ్ వెంకటరమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, మల్లేశం, రాము, బుచ్చయ్య, నర్సింహారెడ్డి ఉన్నారు.

# అమాత్యుడు రామన్న ఔదార్యం

- యువకుడి దవాఖాన బిల్లు రూ.4 లక్షలు మాఫీ
- కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 8 : నిరుపేద యువకుడి మెరుగైన వైద్యానికి అవసరమైన దవాఖాన బిల్లు మాఫీ చేయించి మంత్రి కేటీఆర్ మరోసారి ఔదార్యాన్ని చాటుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన కొండ అఖిల్ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందాడు. వారం రోజుల పాటు చికిత్స పొందిన అఖిల్ ఆరోగ్యం మెరుగుపడడంతో దవాఖాన సిబ్బంది ఆదివారం డిశ్చార్జి చేయాలని, రూ.4 లక్షలు బిల్లు చెల్లించాలని బాధిత కుటుంబ సభ్యులకు సూచించారు. వీరిది నిరుపేద కుటుంబ కావడంతో స్థానిక కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్ వీరి పరిస్థితిని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన అమాత్యుడు సంబంధిత అధికారులు, దవాఖాన యాజమాన్యంతో మాట్లాడి బిల్లును పూర్తిగా మాఫీ చేయించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.